# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 16-2-2022 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:28 | సంచిక:162 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## సీఎం కేసీఆర్‌కు మాజీ ప్రధాని మద్దతు.. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాల్సిందే

హైదరాబాద్, ఫిబ్రవరి 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సర్వత్రా మద్దతు లభిస్తున్నది. ఈ మేరకు మాజీ ప్రధాని, జనతాదళ్ (సెక్యులర్) జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవేగౌడ కేసీఆర్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దేశంలో మత తత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు సీఎం కేసీఆర్‌ను దేవెగౌడ అభినందించారు.

ఈ క్రమంలో సీఎం కేసీఆర్‌కు దేవెగౌడ ఫోన్ చేశారు. దేవెగౌడ మాట్లాడుతూ రావు సాబ్?మీరు అద్భుతంగా పోరాడుతున్నారు. మత తత్వ శక్తుల మీద ఎవరమైనా పోరాటాన్ని కొనసాగించాల్సిందే. దేశ లౌకికవాద సంస్కృతిని, దేశాన్ని కాపాడుకునేందుకు మేమందరం మీకు అండగా ఉంటాం? మీ యుద్ధాన్ని కొనసాగించండి.. మా సంపూర్ణమద్దతు మీకు ఉంటుంది అంటూ దేవెగౌడ తన మద్దతును ప్రకటించారు.

కాగా.. తాను త్వరలోనే బెంగళూరుకు వచ్చి సమావేశమవుతానని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దేవెగౌడకు తెలిపారు.

## క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం : మంత్రి తలసాని




హైదరాబాద్, ఫిబ్రవరి 15:రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం (ఫిబ్రవరి17) సందర్భంగా ఎల్బీ స్టేడియంలో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. జాతీయస్థాయి క్రీడాకారులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించడంలేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. దేశంలోని క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాయన్నారు. క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉండి ప్రోత్సహిస్తుందని మంత్రి తెలిపారు.

వాలీబాల్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ. లక్ష, రెండో విజేత కు రూ.50 వేలు, తృతీయ విజేతకు రూ.25 వేలు నగదు బహుమతులను ఇవ వ్యక్తిగతంగా అందజేస్తానని మంత్రి శ్రీనివాస్ యాదవ్ ప్రకటించి నిర్వాహకులకు అందజేశారు. ఈ పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తో కలిసి బాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జల నగేష్, నాంపల్లి నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆనంద్ గౌడ్, నిర్వాహకులు రాజీవ్ సాగర్, నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సర్వీస్‌లోకి ఏపీ డీజీపీ గౌతం సవాంగ్..



అమరావతి, ఫిబ్రవరి 15: ఆంధ్రప్రదేశ్ డీజీపీ గౌతం సవాంగ్ బదిలీ అయ్యారు. ఆయన కేంద్ర సర్వీస్‌లోకి వెళ్లనున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఈరోజు డీజీపీని బదిలీ చేయడం వెంటనే ఇంటెలిజెన్స్ విభాగంలో డీజీగా పనిచేస్తున్న కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి నియమించడం చకచకగా జరిగిపోయాయి. 1986 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గౌతం సవాంగ్ 2019 మే 30న ఏపీ డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. 2023 జూలై 31 వరకు ఇంకా సర్వీసు ఉండగా ఆకస్మత్తుగా బదిలీ చేయడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని భావిస్తున్నారు.

ఏపీ ప్రభుత్వం గౌతం సవాంగ్‌కు పోస్టింగ్ ఇవ్వకుండానే జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు విడుదల చేయడంతో ఈ విషయం ఏపీ పోలీసు వర్గాల్లో చర్చాంశనీయంగా మారింది. బదిలీ విషయం తెలియగానే ఏపీ సీఎం జగన్‌ను గౌతం సవాంగ్ కలిశారు. రిలీవైన కొద్ది గంటల్లోనే ఆయన కేంద్ర సర్వీస్‌లోకి బదిలీ అయ్యారు.

## జి20 సచివాలయాన్ని మరియు ఆ సంస్థ తాలూకు నివేదన విభాగాలను ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:జి20 సచివాలయాన్ని మరియు ఆ సంస్థ తాలూకునివేదన విభాగాల ను ఏర్పాటు చేయడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత నఈ రోజు న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదాన్ని తెలిపింది. జి20 కి భారతదేశం త్వరలోనే అధ్యక్షతవహించి సారథ్యాన్ని చేపట్టనుండడం తో అనంతరం తీసుకొనేటటువంటి విధానపరమైన నిర్ణయాల సమగ్రఅమలు కు జి20 సచివాలయం పూచీపడనుంది.

భారతదేశం 2022వ సంవత్సరం డిసెంబర్ 1వ తేదీ మొదలుకొని 2023వ సంవత్సరం నవంబర్ 30వ తేదీ వరకు జి20 కి అధ్యక్ష బాధ్యత నునిర్వహించనుంది. 2023వ సంవత్సరం లో భారతదేశం లో జరిగే జి20 శిఖర సమ్మేళనం తో భారతదేశం అధ్యక్షబాధ్యత ముగుస్తుంది. జి20 అనేది అంతర్జాతీయం గా ఆర్థిక పరమైనటువంటి సహకారాని కి ఉద్దేశించిన మరియు ప్రపంచం లో ఆర్థిక వ్యవహారాల పాలన లో ఒకముఖ్యమైన పాత్ర ను పోషించేటటువంటి ఒక ప్రధానమైన వేదిక గా ఉన్నది.వాడుక ప్రకారం,జి20 కి భారతదేశం అధ్యక్షత తాలూకు జ్ఞాన పరమైన/విషయ పరమైన, సాంకేతిక పంమైన, ప్రసార మాధ్యమాల కు సంబంధించిన, భద్రత పరమైన, ఇంకా లాజిస్టిక్ పరమైనటువంటి అంశాలతో ముడిపడిన కార్యాల ను పూర్తి చేయడం కోసం జి20 సచివాలయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతున్నది. దీనిని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇంకా ఇతర సంబంధిత మంత్రిత్వ శాఖలు/విభాగాల కు చెందిన అధికారులు మరియు సిబ్బంది కి తోడు గా డమేన్ నాలెడ్జ్ ఎక్స్పర్ట్స్ నడుపుతారు. ఈ సెక్రటేరియట్ 2024వ సంవత్సరం ఫిబ్రవరి వరకు విధుల నునిర్వహిస్తుంది. ఈసచివాలయాని కి ప్రధాన మంత్రి అధ్యక్షత వహించే ఒక అత్యున్నత సంఘం మార్గదర్శకత్వాన్నిఅందించనుంది. ఈ అత్యున్నత సంఘం లో ఆర్థిక మంత్రి, హోం మంత్రి, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి, జి20 శెర్ పా (వాణిజ్యం ఽ పరిశ్రమ, వస్త్రాలు, వినియోగదారు వ్యవహారాలు, ఆహారం, ఇంకా సార్వజనిక వితరణ శాఖ మంత్రి) కూడాఉంటారు. ఈ సంఘం జి20 అధ్యక్ష హోదా లో నడుచుకొనేభా రతదేశాని కి మొత్తం మీద మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ఇంకా, జి20 కు సంబంధించిన అన్ని సన్నాహాల నుపర్యవేక్షించడం కోసం మరియు అత్యున్నత సంఘాని కి నివేదించడం కోసం ఒక సమన్వయసం ఘాన్ని కూడా ఏర్పాటు చేయడం జరుగు తుంది. జి20 సచివాలయం బహుళ పక్ష వేదికల లో ప్రపంచ అంశాలపై భారతదేశం నాయకత్వం నెరపడం కోసం జ్ఞానం ఇంకా, ప్రావీణ్యం సహా దీర్ఘకాలిక కెపాసిటీబిల్డింగ్ కు మార్గాన్ని సుగమం చేస్తుంది.

## నదుల అనుసంధానం దేశానికి విపత్తు -రాజేందర్ సింగ్




హైదరాబాద్, ఫిబ్రవరి 15: నదుల అనుసంధానం దేశానికి విపత్తు అని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ స్పష్టం చేశారు. నదుల అనుసంధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన తేల్చిచెప్పారు. నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రాల మధ్య తగాదాలు వస్తాయన్నారు. మిగులు జలాలు ఉన్నాయని ఏ రాష్ట్రం అంగీకరించలేదు అని ఆయన పేర్కొన్నారు. అనుసంధానమంటే నీటిని ప్రయివేటు, వాణిజ్యపరం చేయడమే అని చెప్పారు. నదుల అనుసంధానం అవినీతికి ఆజ్యం పోస్తుందని మండిపడ్డారు. అనుసంధానించాల్సింది నదులను కాదు.. నదులతో మనషుల మేథస్సు, హృదయాన్ని అని రాజేందర్ సింగ్ సూచించారు. కేంద్రం నదుల అనుసంధానాన్ని చేపడితే గాంధీజీ మార్గంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. నగరంలోని జలసౌధలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ సింగ్ ప్రసంగించారు.

### తెలంగాణను అన్ని రాష్ట్రాలు అనుసరించాలి..

నీటి పారుదల విషయంలో ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు తెలంగాణ సీఎం కేసీఆర్‌ను చూసి నేర్చుకోవాలి అని రాజేందర్ సింగ్ సూచించారు. సాగునీటి రంగంలో సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు అన్ని రాష్ట్రాలు అనుసరించాలన్నారు. సీఎం కేసీఆర్ విజ్ఞప్తి మేరకు వాటర్ యూనివర్సిటీ నెలకొల్పాలి. వ్యవసాయానికి, ఇతర రంగాలకు క్రమం తప్పకుండా నీటిని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానని రాజేందర్ సింగ్ పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో పైపుల ద్వారా మంచినీటి సరఫరా చేయడం హర్షణీయం. తెలంగాణలో ఎక్కడా ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రజలకు అందించే పరిస్థితి లేదు అని ఆయన స్పష్టం చేశారు.

### రివర్ లిటరీస మూవ్‌మెంట్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి..

రివర్ లిటరసీ మూవ్‌మెంట్‌ను త్వరలోనే ప్రారంభం చేస్తున్నామని, ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలి అని రాజేందర్ సింగ్ పిలుపునిచ్చారు. నీటికి సంబంధించి దేశ ప్రజలకు కావాల్సిన మ్యానిఫెస్టోను జాతీయ సదస్సులో విడుదల చేస్తాం అని చెప్పారు. సుప్రీంకోర్టు సూచనలతో 1992లో 25 వేల మైనింగ్ కంపెనీలు మూసివేశారు. తరువాత భూగర్భ జలాలు ఉబికి వచ్చి నీటి సమస్య పరిష్కారం అయిందని రాజేందర్ సింగ్ గుర్తు చేశారు.

### యాదాద్రి ఆలయం అద్భుతం.. దేశానికే కేసీఆర్ రోల్ మోడల్

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం చాలా బాగుంది. సర్వాంగ సుందరంగా దేవాలయాన్ని తీర్చిదిద్దారు అని రాజేందర్ సింగ్ కొనియాడారు. మూడు చెరువుల నుంచి దేవాలయానికి నీరు సరఫరా చేస్తున్నారు. ప్రకృతిని ప్రేమిస్తే మనుషులకు బలమైన శక్తి సిద్ధిస్తుంది. సీఎం కేసీఆర్‌ను చూసి దేశం నేర్చుకోవాల్సిందే అని ఆయన పేర్కొన్నారు. దేశానికి సీఎం కేసీఆర్ రోల్ మెడల్ అని రాజేందర్ సింగ్ చెప్పారు.

## కిషన్‌రెడ్డికి దమ్మంటే సమాధానం చెప్పాలి.. సొల్లు పురాణం వద్దు: హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 15:ఏ విషయంలోనూ కేంద్రం నుంచి రాష్ట్రానికి మద్దతు లేదు అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను విమర్శించడం సరికాదు.. దమ్ముంటే తెలంగాణలోని ఏ ప్రాజెక్టుకు అయినా జాతీయ హోదా తీసుకురా అని కిషన్ రెడ్డికి హరీశ్‌రావు సవాల్ విసిరారు.

తెలంగాణ భవన్‌లో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రజలు బానిస సంకెళ్లను బద్దలు కొట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. దేశ ప్రజలను ఇవాళ బీజేపీ నాయకులు బానిసలుగా చూస్తున్నారు. బానిసత్వానికి వ్యతిరేకమైన కేసీఆర్‌ను విమర్శించడం సరికాదు. ప్రజలు బీజేపీని నమ్మే స్థితిలో లేరు. కిషన్ రెడ్డికి దమ్ముంటే.. తెలంగాణలోని ఒక ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా ఇప్పించాలి. అప్పుడు మేం వచ్చి ఎయిర్‌పోర్టులోనే ఆయనకు దండలు వేస్తాం. నదుల అనుసంధానం జరిగితే తెలంగాణ సస్యశ్యామలం అవుతదని కిషన్ రెడ్డి అంటున్నారు. గోదావరి నీళ్లను కృష్ణాకు, కృష్ణా నుంచి పెన్నాకు, పెన్నా నుంచి కావేరికి నీళ్లను తీసుకుపోతామని అంటున్నారు. తెలంగాణ నీళ్లను కర్ణాటకు, తమిళనాడుకు తీసుకుపోతే మనం సమర్థించాలటా? అసలు కిషన్ రెడ్డి ఏ రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. తెలంగాణ భూభాగానికి సరిపోయిన నీళ్లను కేటాయించిన తర్వాతే మిగతా రాష్ట్రాలకు తీసుకెళ్లాలి అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

### కేసీఆర్‌ది ప్రజల భాష..

ముఖ్యమంత్రి కేసీఆర్ భాష గురించి మాట్లాడే హక్కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేదు అని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో మాట్లాడిన భాషే కేసీఆర్ ఇవాళ మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజల భాషను కేసీఆర్ మాట్లాడుతారు. మీది మతాల మధ్య చిచ్చు పెట్టే భాష. మతాల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టే భాష మీది. కేసీఆర్‌ది ప్రజల భాష, సామాన్య ప్రజల భాష, పల్లెల్లో రైతులు మాట్లాడుకునే భాష అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

### అమరవీరుల స్థూపం తాకే అర్హత కిషన్ రెడ్డికి లేదు..

కిషన్ రెడ్డికి అమరవీరుల గురించి మాట్లాడే అర్హత లేదు. అమరవీరుల స్థూపం కూడా తాకే అర్హత ఆయనకు లేదు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసి, ఢిల్లీని కూకటివేళ్లతో కదిలించి తెలంగాణను సాధించారు. సీమాంధ్ర నాయకులు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్నారు. ఎంతో మంది తెలంగాణ బిడ్డలు త్యాగాలు చేశారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేశారు. యెండల లక్ష్మీనారాయణ రాజీనామా చేశారు. కిషన్ రెడ్డి రాజీనామా చేయకుండా పదవిని పట్టుకున్నారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడలేదు. జై ఆంధ్రా ఉద్యమానికి నాయకత్వం వహిస్తానని,, 2011, డిసెంబర్ 8న కిషన్ రెడ్డి ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ట్వీట్ చేశారు. రాజీనామా చేయకుండా ముఖం చాటేసి.. ఇవాళ సిగ్గులేని మాటలు మాట్లాడుతున్నారు. తెలంగాణ సమాజానికి వెన్నుపోటు పొడిచారు. యెండల లక్ష్మీనారాయణను గెలిపించుకునే పరిస్థితి నీకు లేదు. సొంత పార్టీ కాకపోయినా తెలంగాణ కోసం కేసీఆర్ యెండలను గెలిపించారు. అమరుల గురించి మాట్లాడే నైతికత కిషన్ రెడ్డికి లేదు అని హరీశ్‌రావు అన్నారు.

### తెలంగాణ వచ్చింది కాబట్టే కేంద్రమంత్రివి అయ్యావ్..

తెలంగాణ వచ్చింది కాబట్టే ఇవాళ కేంద్ర మంత్రివి అయ్యావు. 2019, ఆగస్టు 6న ఆర్టికల్ 370 మీద చర్చ జరిగినప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అమిత్ షా అడ్డగోలుగా మాట్లాడారు. విద్వేషాన్ని చిమ్మారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బ్లాక్ డేగా వర్ణిస్తే.. కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా కిషన్ రెడ్డి బల్లలు చరిచారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోదీ దెబ్బతీసే విధంగా మాట్లాడితే కిషన్ రెడ్డి బల్లలు చరిచారు. మా చరిత్రను కించపరిచేలా మాట్లాడుతున్నావు అని మోదీని, అమిత్ షాను ఏనాడూ కిషన్ రెడ్డి నిలదీయలేదు అని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

### సూటిగా సమాధానం చెప్పకుండా..

కేసీఆర్ అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పకుండా కిషన్ రెడ్డి అడ్డగోలు వాదనలు చేస్తున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఎఫ్‌సీఐకి బడ్జెట్‌లో రూ. 65 వేల కోట్లు కోత పెట్టారని కేసీఆర్ అడిగారు. ఉపాధి హామీకి రూ. 25 వేల కోట్లు తగ్గించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు రిజర్వేషన్ పెరగాలని కేసీఆర్ కోరారు. హైదరాబాద్‌కు వరదలు వస్తే కేంద్రం నుంచి నిధులు ఏమైనా మీరు ఇప్పించారా? తెలంగాణకు ఒక్క ట్రిపుల్ ఐటీ ఇవ్వలేదు. రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు అయినా మీరు తెచ్చారా? మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి.. రాష్ట్ర ప్రభుత్వం రూ. 364 కోట్లు ఇచ్చింది. మీరు ఇచ్చింది కేవలం రూ. 2.5 కోట్లు మాత్రమే. వీటన్నింటిపై కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి. పేదల కడుపుకొట్టి గద్దలకు పంచి పెడుతున్నారు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

## కేసీఆర్ నిప్పు.. బీజేపీ నేతలు మసై పోతారు : మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15:రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ నిప్పు.. బీజేపీ నాయకులు ఆయన్ను ముట్టుకుంటే మసై పోతారని తేల్చిచెప్పారు. సీఎం కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు బీజేపీ నేతలు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారని మండిపడ్డారు.

టీఆర్ఎస్ఎల్పీలో మంత్రి జగదీశ్ రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడారు. విద్యుత్ సంస్కరణల పై సీఎం కేసీఆర్ చేసిన వాదన తప్పు అని బండి సంజయ్, కిషన్ రెడ్డి అంటున్నారు. ఒప్పు అని మేము అంటున్నాం. వారిద్దరూ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. కేంద్రం ఏప్రిల్ 27, 2021 నాడు విద్యుత్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. దశల వారిగా అన్ని రంగాల్లో ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని ఆ పాలసీలో స్పష్టంగా ఉంది. ఆర్థిక సాయానికి కేంద్రం విద్యుత్ సంస్కరణలతో ముడి పెట్టింది. కేంద్రం చెప్పినట్టుగా విద్యుత్ సంస్కరణలకు ఒప్పుకోక పోవడం వల్ల తెలంగాణ ఏటా రూ. 5 వేల కోట్లు నష్టపోతుందని మంత్రి తెలిపారు. మీటర్లు పెట్టిన వారికి, ప్రైవేట్ పరం చేసిన వారికి కేంద్రం సాయం చేస్తోంది అని విమర్శించారు. రాష్ట్రంలో మీటర్లు పెట్టే ప్రసక్తే లేదు అని జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు.

కేసీఆర్ భాష గురించి కిషన్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగాం ఉందన్నారు మంత్రి. బీజేపీ నేతలు ఎలాంటి భాష వాడుతున్నారో కిషన్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. కిషన్ రెడ్డితో చర్చకు టీఆర్ఎస్ కార్యకర్త కూడా అవసరం లేదు.. తన నియోజకవర్గంలోకి వెళ్లి సాధారణ ఓటరును అడిగినా కేంద్రం ఏం ఒరగబెట్టిందో చెబుతారు అని మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. కిషన్ రెడ్డి మాట్లాడిన తీరు చూసి జనం నవ్వుకుంటున్నారు. ఆయనను చూస్తుంటే జాలి వేస్తోందన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. మోడీ ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి అమలు కాలేదు అని మంత్రి నిప్పులు చెరిగారు.

## కేసీఆర్ సవాల్‌ను స్వీకరిస్తున్నా... చర్చకు సిద్ధం..కానీ-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్: మోదీ ప్రభుత్వం ఏడేళ్లలో దేశానికి ఏం చేసిందో చెప్పడానికి బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ముందు అమరుల సాక్షిగా కేసీఆర్‌తో చర్చకు సిద్ధమన్నారు. కేసీఆర్ బహిరంగ సవాల్‌ను కేంద్రం తరపున తాను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అయితే..."బహిరంగ చర్చకు నేను సిద్ధం కానీ ఒక షరతు!- కేసీఆర్ ప్రజలు మాట్లాడే భాష మాట్లాడాలి" అని అన్నారు. బీజేపీకి దేశమే ముఖ్యమని... వ్యక్తులు, కుటుంబం కాదన్నారు. కానీ కేసీఆర్‌కు వ్యక్తులు, కుటుంబం మాత్రమే ముఖ్యమని కేంద్రమంత్రి అన్నారు. భారత రాజ్యాంగంను ప్రపంచం అంతా పొగడని దేశం ఉండదన్నారు. ఇండియా అంటే ఇందిరా అనే నినాదాన్ని రాజ్యాంగం ద్వారనే ఓడించారని తెలిపారు. రాజ్యాంగ హక్కు వల్లనే హుజురాబాద్‌లో కేసీఆర్ ఓడిపోయారని అందుకే రాజ్యాంగం మారాలని అంటున్నారని మండిపడ్డారు.

బీజేపీకి నడ్డా తరువాత ఎవరు అధ్యక్షుడు అవుతారో ఎవరూ చెప్పలేం ని...కానీ టీఆర్ఎస్ పార్టీకి కేసీఆర్ తరువాత కేటీఆర్ అధ్యక్షుడు అవుతారన్నారు. రాష్ట్ర భవిష్యత్ కేసీఆర్ డైనింగ్ టేబుల్‌పై నిర్ణయాలు జరుగుతాయని వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో ఏం జరుగుతుందో తెలుసా కేసీఆర్ అని ప్రశ్నించారు. గత ఏడేళ్లుగా మతకలహాలు లేవని... బాంబ్ పేలుళ్లు లేవని, కర్ఫ్యూలు లేవన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో నెలల పాటు రోడ్లన్నీ మూసివేసి ఉండేవని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల శాంతితో ముందుకు వెళ్తున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## దేశంలో భారీగా తగ్గిన కరోనా కేసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: దేశంలో కరోనా మహమ్మారి తగ్గుముఖం పడుతున్నది. థర్డ్‌వేవ్ వైరస్ వణించగా.. రోజువారీ కేసులు తగ్గుతుండడంతో జనం ఊపిరిపీల్చుకుంటున్నారు. గడిచిన 24 గంటల్లో కొత్తగా 27,409 కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. తాజాగా 82,817 మంది బాధితులు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. మరో 347 మంది వైరస్‌తో ప్రాణాలు కోల్పోయారు.


ప్రస్తుతం దేశంలో 4,23,127 యాక్టివ్ కేసులున్నాయి. రోజువారీ పాజిటివిటీ రేటు 2.23శాతంగా ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 4,26,92,943కు చేరింది. ఇందులో 4,17,60,458 మంది కోలుకున్నారు. వైరస్ కారణంగా 5,09,358 మంది ప్రాణాలు వదిలారు. మరో వైపు దేశంలో టీకా డ్రైవ్ కొనసాగుతున్నది. ఇప్పటి వరకు 173.42 కోట్ల డోసులు పంపిణీ చేసినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ వివరించింది.

## తలపాగా చుడితే ఎవరైనా సర్దార్జీ అవరు : మోదీపై ప్రియాంక గాంధీ సెటైర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం జలంధర్ ర్యాలీలో ప్రధాని మోదీ తలపాగా ధరించి ప్రత్యక్షం కావడాన్ని ఉద్దేశించి ఎవరైనా తలపాగా ధరించగానే సర్దార్ కాలేరని ప్రియాంక గాంధీ చురకలు వేశారు. వేదికపై నకిలీ తలపాగాతో దర్శనమివ్వగానే ఎవరూ సర్దార్జీ కారని వారికి చెప్పండని అన్నారు. నిజమైన సర్దార్ ఎవరో వారికి చెప్పండి. ఈ తలపాగాలో ఎంతటి ధైర్యం, కఠోరశ్రమ దాగుందో వారికి తెలియచెప్పండని ప్రియాంక పేర్కొన్నారు. పంజాబ్ పంజాబీలకు చెందినదని, దాన్ని వారు నడిపించుకుంటారని బీజేపీ, ఆప్‌లకు చెప్పండని సూచించారు. పంజాబ్‌లో ఓ పార్టీ గుజరాత్ మోడల్‌ను ముందుకుతెస్తుండగా మరో పార్టీ ఢిల్లీ మోడల్ అంటూ హడావిడి చేస్తోందని బీజేపీ, ఆప్‌లపై ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు.


గుజరాత్ మోడల్‌ను మీరు పరిశీలిస్తే ఏ ఒక్కరికి ఉద్యోగాలు అందుబాటులో ఉండవని, వ్యాపారాలు సజావుగా సాగవనీ, ఎలాంటి నిధులూ సమకూరవని తెలుస్తుందని చెప్పారు. ఇక ఢిల్లీ మోడల్‌లో ఏ ఒక్క ఆస్పత్రి, విద్యాసంస్థలను కొత్తగా నిర్మించలేదని ప్రియాంక ఎద్దేవా చేశారు. మరోవైపు పంజాబ్ కాంగ్రెస్‌లో అంతర్గత పోరుకు తెరదించేలా ఆ పార్టీ పలు సంకేతాలు పంపుతోంది. పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ తనకు సోదరుడి వంటి వాడని, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీకి కీలకమని సీఎం చరణ్జిత్ సింగ్ చన్నీ అన్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ సుందరముగ హాస్యపు మక
రందము చిందించి నట్టి రాకాశశిలౌ
"ఇందర జిత్సింగ్ జోహార్"
అందరిలో ఘనత కెక్కె యభినుతులగానెనె!!

( ఫిబ్రవరి 16 హిందీ హాస్యనటుడు ఐ.ఎస్.జోహార్-ఇందరజిత్‌సింగ్ జోహార్ జయంతి..




-రాధశ్రీ

సెల్: 9494481210

## ఏపీలో మరోసారి సమ్మె ?!

అమరావతి, ఫిబ్రవరి 15: తృటిలో సమ్మె తప్పిపోయిందని సంబరపడిపోయిన ఏపీ ప్రభుత్వ పెద్దలకు.. ఇప్పుడు మరో టెన్షన్ పట్టుకున్నది. పీఆర్సీ సాధన కమిటీ నేతలను మచ్చిక చేసుకుని సమ్మెకు పోకుండా చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు మెరుపు సమ్మెకు దిగాలని చూస్తున్న వారి పట్ల ఏవిధంగా వ్యవహరిస్తుందో అని ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విజయవాడలో ర్యాలీ నిర్వహించిన పీఆర్సీ సాధన కమిటీ సభ్యులు చూపిన దారిలోనే వెళ్లేందుకు మరో వర్గం ఉద్యోగులు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది.తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకు ఏపీలోని లక్షలాది మంది ఉద్యోగులు ప్రత్యక్ష కార్యాచరణకు దిగేందుకు ప్లాన్ చేసుకుం టున్నారు. అంతా సాఫీగా సాగిపోతున్నదని అనుకుంటున్న తరుణ ంలో.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రూపంలో మరోసారి సమ్మె గంటలు మోగనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ప్రతిపాదనలు వచ్చినప్పటి నుంచి నిరసనలు మొదలయ్యాయి. ఫిట్‌మెంట్ మినహా మిగతా అంశాల్లో ప్రభుత్వం దిగిరావడంతో పీఆర్సీ సాధన కమిటీ సమ్మెను విరమించుకుంటున్నట్లు ప్రకటిం చింది. ప్రభుత్వంతో చర్చల సమయంలో తమ గురించి పీఆర్సీ సాధన కమిటీ పెద్దలు ఆలోచించలేదని గుర్రుగా ఉన్నారు. ప్రభుత్వం వెన్నులో వణుకుపుట్టేలా నిరసనకు పూనుకోవాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిర్ణయిస్తున్నట్లు సమాచారం.

# కపోతాల ఖరీదైన పరుగు పందాలు

కోడి పందాలు, పొట్టేలు పందాలు, ఎడ్ల పందాలు, శునకాల పందాలు లాంటి మాటలు విన్నాం, చూస్తున్నాం కూడా. పూర్వకాలంలో పావురాలతో సందేశాలు పంపడం గూర్చి విన్నాం. ఆధునిక మనవుడు ప్రతి ఏట శీతాకాలంలో కపోతాల పందాలను కూడా నిర్వహించడం, లక్షలలో/కోట్లలో నగదు చేతులు మారడం జరుగుతున్నట్లు పలు వార్తలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలలో పావురాల పందాలు నిర్వహిస్తున్నట్లు కేసులు నమోదు అవుతున్నాయి. క్రీడాకారులకు పరుగు పందెం నిర్వహించిన విధంగానే పోటీలో పాల్గొనే పావురాలను ఒక ప్రదేశం నుంచి ఎగుర వేయడం, నిర్ధేషిత స్థానాలకు వేగంగా ప్రయణించడం, ముందుగా చేరిన పావురాన్ని విజేతగా ప్రకటించడం, గెలిచిన పావురం యజమానికి భారీగా బహుమతులు ప్రకటించడం ఈ పందాల పద్ధతిగా ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో ప్రారంభం అవుతున్న అనధికారిక పావురాల పందెంలో వందల పావురాలు పోటీలో పాల్గొంటున్నాయి. ఇటీవల నాయుడు పేట నుంచి చెన్న వరకు నిర్వహించ తలపెట్టిన పీజియన్ ఫైట్‌కు సకాలంలో పోలీసులు స్పందించి నిర్వాహకులను అదుపులోని తీసుకొని బ్రేకులు వేయడంతో ఈ పందాల గూర్చి బయటి ప్రపంచానికి తెలిసి పోయింది. గతంలో పావురాల పందాలను పలుమార్లు నిర్వహించినట్లుగా వార్తలు గుప్పుమనడంతో ప్రజలు విస్తుపోతున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం చిన్నకొత్తపల్లి గ్రామ శివార్లలో ఒక్కసారిగా పోటీలో పాల్గొనే వందల పావురాలు గాల్లోకి ఎగురడంతో ప్రజలు ఆందోళన చెందడం, పోలీసులకు సమాచారం అందడం, నిర్వాహకులను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో రహస్య పోటీల విషయం బయట పడింది.

అనధికారికంగా పందెంలో పాల్గొనే పావురాలను చెన్నై నుంచి బోన్లలో బంధించి లారీలలో చిన్నకొత్తపేట గ్రామశివారుకు తీసుకువచ్చారు. ఈ గ్రామ శివారులోంచి అన్ని పావురాలను ఒకే సారి వదిలి వేశారు. ఈ పావురాలు ఎగురుతూ దాదాపు 450 కిమీలకు పైగా ప్రయాణించి చెన్నై వరకు చేరాల్సి ఉంది. ఈ పందెంలోని పావురాల కాళ్ళకు నిర్వాహకులు ప్రత్యేక నెంబరు కలిగిన పట్టీలను అమర్చుతారు. పందెంలో పాల్గొన్న పావురాల్లో చెన్నై ముందుగా చేరిన పావురాన్ని విజేతగా ప్రకటించి, దాని యజమానికి భారీ నగదు లేదా ఖరీదైన బియండబ్ల్యూ కార్లను బహుమతిగా అందజేసే స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలియని గ్రామస్థులు ఆశ్చర్య పోవడం, 'విండో పీజియన్ సంస్థ' నిర్వహకులపై పోలీసులకు సమాచారం అందడంతో బెట్టింగ్ బాబులు పరుగుతీశారు. ఇలాంటి వినూత్న పందాలు కొత్తగా, ఉత్సాహంగా అనిపించినప్పటికీ జంతు సంరక్షణ చట్టం, జంతు ప్రేమికులు అభ్యంతరం తెలుపడం సముచితంగా ఉన్నది. సాధారణంగా సంక్రాంతి లాంటి పర్వదినాల్లో కోళ్ళ పందాలు, ఎడ్ల పందాలు పెద్ద ఎత్తున అనధికారికంగా నిర్వహించడం, కోట్ల రూ?లు చేతులు మారడం కోనసీమ ప్రాంత ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. ఈ పోటీలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సినీ పరిశ్రమకు చెందిన లాంటి ప్రముఖులు హాజరు కావడం, పందెం కాయడం సర్వసాధారణం అయ్యింది.

ఇటీవల చెనైలోని రిజిస్టర్డ్ 'గుడ్‌విల్ పీజియన్ క్లబ్' నిర్వహించిన 1750 కిమీ పందెంలో 300లకు పైగా పావురాలు పాల్గొనగా 11 రోజులలో లక్ష్యం చేరిన పావురం యజమానికి ప్రథమ బహుమతిని ప్రకటించారు. పావురాలకు గుర్తింపు ఇవ్వడానికి హైదరాబాద్, చెన్నై, కర్నూలు లాంటి నగరాలలో ఏర్పాట్లు ఉన్నాయి. కపోతాలకు 1,000 -1,700 కిమీ యంగర్స్, ఓపెన్, దర్బీ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారని తేలింది. దేశవ్యాప్తంగా దాదాపు 250కి పైగా కపోత పందాలు, కోడి పందాలు, పావురాల పందాలు లాంటివి నిర్వహిస్తూనే ఉన్నారు. ఒక్క చెన్నై నగరంలోనే 60-70 రిజిస్టర్డ్ సొసైటీలు ఉండడం గమనించారు. హైదరాబాద్‌లో హోమర్స్, డెక్కన్, హైదరాబాద్ హోమ్ పేర్లతో పీజియన్ క్లబ్బులు నడుస్తున్నాయి. పోలీసులు, అటవీశాఖల అనుమతులు తీసుకున్న రిజిస్టర్డ్ సంస్థలు కపోత పందాలు నిర్వహిస్తున్నాయి. పందాల్లో పాల్గొనే పావురాలకు ప్రతి రోజు అర గంట, పోటీల సీజన్లో 2 గంటల పాటు ప్రత్యేక శిక్షణను ఇస్తారు. ఒక్కొక్క యజమాని 32 పావురాలను పోటీలో దించవచ్చు. పోటీలో పాల్గొనే పావురాల కాళ్ళకు క్లబ్ నిర్వహకులు రింగు లేదా స్క్రాచ్ కార్డు తొడుగుతారు. యజమాని ఇంట్లో పెరిగే పావురాలు ఎగిరి తిరిగి తిరిగి యజమాని ఇంటికి చేరేలా శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ పోటీలలో గెలిచే పావురాలకు ట్రోఫీలు మాత్రమే అందిస్తారు, నగదు లేదా భారీ బహుమతులు ఉండవు. పోటీలో గెలుపొందిన కపోతాల పిల్లలకు 5 – 80 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. ఇటీవల కోయంబత్తూరుకు చెందిన ఉదయన్ అనే వ్యక్తికి చెందిన పావురం ఏకబిగిన 85 గంటల 11 నిమిషాలు గాల్లో ఎగిరి రికార్డు సృష్టించింది. పావురాల కళ్ళు, రెక్కలను బట్టి వాటి ధరలు, శక్తి సామర్థ్యాలు నిర్ణయిస్తారు. ఇటీవల ఖమ్మంలో స్క్రాచ్ కార్డు కలిగిన పావురాలను గుర్తించిన విషయం మనకు విధితమే. ఇలాంటి జంతువుల మధ్య అనధికారికంగా సరదా కోసం అంటూ పోటీలు నిర్వహించడం విషయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారి తీస్తున్నది.



– డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# సీఎం జగన్‌తో చాలా మాట్లాడా- తిరుపతిలో స్టూడియో పెడతా - మంచు విష్ణు



అమరావతి, ఫిబ్రవరి 15:ఏపీ ముఖ్యమంత్రి జగన్ తో హీరో మంచు విష్ణు భేటీ ముగిసింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ .. వివరాలను వెల్లడించారు. సీఎంతో తాను చాలా విషయాల గురించి మాట్లాడానని చెప్పారు. జగన్ తో మాట్లాడిన విషయాలు వ్యక్తిగతమైనవని అన్నారు. సినీ పరిశ్రమ సమస్యలపై కూడా చర్చించామని చెప్పారు. సినీ పరిశ్రమకు ఏపీ, తెలంగాణలు రెండు కళ్లు అని చెప్పారు. సినీ పరిశ్రమ మొత్తం ఒకే కుటుంబమని అన్నారు.తిరుపతిలో తాను సినిమా స్టూడియో పెడతానని తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చలకు నాన్న గారిని పిలవలేదనేది దుష్ప్రచారమని చెప్పారు. విశాఖకు సినీ పరిశ్రమను ఎలా తరలించాలనే విషయంపై ఆలోచిస్తామని తెలిపారు.

# ప్రధానిగా రాహుల్ గాంధీ తొలి సంతకం, ప్రత్యేక హోదాపైనే -తులసిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15:వైసీపీ,టీడీపీ,జనసేనకు ప్రత్యేక హోదా తెచ్చే శక్తి , ఇచ్చే శక్తి లేదని కాంగ్రెస్ నేత తులసిరెడ్డి అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా అనే అంశం ముగిసిన అధ్యాయనమని , బిజెపి వారిని మోసం చేసిందన్నారు. తమ పార్టీ మాట మీద నిలబడుతుందని అన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు అని ఆయన చెప్పారు. హోదా కాంగ్రెస్ పేటెంట్, అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం అన్నారు.

ప్రాంతీయ పార్టీలు ఒట్టిమాటలు మాత్రమే మాట్లాడతాయని అన్నారు. ప్రాంతీయ పార్టీల ఉచ్చులో ప్రజలు పడకూడదని ఆయన సూచించారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని, ఏపీకి ప్రత్యేక హోదా పొందాలని ఆయన అన్నారు. ప్రధానిగా రాహుల్ గాంధీ తొలి సంతకం ప్రత్యేక హోదా ఫైలు పైనే పెడతారని ఆయన చెప్పారు.

# త్వరలో పార్టీ ఆఫీస్ నుంచి ప్రకటన వస్తుంది -నటుడు ఆలీ




అమరావతి, ఫిబ్రవరి 15:సీఎం జగన్ తో సినీ నటుడు ఆలీ భేటీ అయ్యారు. భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు..త్వరలో పార్టీ ఆఫీస్ నుంచి ప్రకటన వస్తుందని తెలిపారు. రెండు వారాల్లోనే ప్రకటన ఉంటుందని అనుకుంటున్నానని చెప్పారు. సీఎం జగన్ ని కలిశాను, ఆయన నవ్వారు అని ఆలీ తెలిపారు. సీఎం జగన్ తో నాకు ఎప్పటి నుంచో పరిచయం ఉందని ఆలీ వెల్లడించారు. గత ఎన్నికల్లోనే ఆఫర్ చేశారు, కానీ వద్దన్నానని చెప్పారు. ఈ మధ్యే టాలీవుడ్ లో పలువురు స్టార్స్ సీఎంని కలిశారు.కాగా వారితో పాటు ఆలీ కూడా కలిశారు. నేడు ఆలీ జగన్ ని కలవడం ప్రాధాన్యతని సంతరించుకుంది. సినీ ప్రముఖుల్ని సీఎం అవమానపరచలేదన్నారు.ఆలీ తన భార్యతో కలిసి జగన్ ని కలిశారు.

# నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో శ్రీవారి సర్వదర్శనం టికెట్లు

తిరుమల, ఫిబ్రవరి 15: : కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నది. కొవిడ్ ?19 మహమ్మారి వ్యాప్తి కట్టడికి నిలిపివేసిన సర్వదర్శనం (రాజీతీలజీ ఆజీతీబస్త్రజీని) ఆఫ్‌లైన్ల టోకెన్ల జారీని నిలిపివేసిన విషయం విధితమే. ఇటీవల కరోనా తగ్గుముఖం పడుతుండడంతో సర్వదర్శనం టోకెన్ల జారీని ఇవాల్టి నుంచి పునరుద్ధరించనున్నది.

బుధవారానికి సంబంధించిన టోకెన్లను మంగళవారం ఉదయం 8 గంటలకు జారీ చేయనున్నది. ఇందు కోసం తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం కాంప్లెక్స్, గోవింద రాజస్వామి సత్రాల్లో కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం కోరింది.

# ఏడుపాయల జాతరకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి ..!

మెదక్, ఫిబ్రవరి 15 (నేటి నిజం ప్రతినిధి) మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయలలోని వనదుర్గా మాతను సందర్శించడానికి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశమున్నందున గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాతరలో ఎటువంటి చిన్న సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ ఎస్. హరీష్ అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతూ కరోనా తగ్గుముఖం పట్టినందున మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మార్చి 1 నుండి మూడు రోజుల పాటు జరిగే జాతరకు జిల్లా నలుమూలల నుండే గాక పొరుగు జిల్లాలైన సంగారెడ్డి ,సిద్దిపేట, కరీంనగర్, హైదరాబాద్ , యాదాద్రి తదితర జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుండి సుమారు 8 నుండి 10 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశమున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయవలసినదిగా అధికారులను ఆదేశించారు. మార్చి 1 న శివరాత్రి జాగరణ, 2 న బండ్లు తిరుగుట, 3 న రథోత్సవం ఉంటుందని, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆర్.డి.ఓ. , డి.ఎస్.పి , సంబంధిత అధికారులు ప్రాథమికంగా ఏడుపాయలను వెంటనే సందర్శించి ఏర్పాట్లపై దృష్టిపెట్టి జాతరకు మూడు రోజుల ముందే అన్ని పనులు పూర్తి చేయాలని అన్నారు.

ప్రధానంగా శివరాత్రి, ఆ మరుసటి రోజు భక్తులు అమ్మవారిని సందర్శించడానికి ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశమున్నందున భక్తులు ఇబ్బందిపడకుండా వి.ఐ.పిలు, వంద రూపాయల ప్రత్యేక టిక్కెట్ దర్శనం, సాధారణ ప్రజల కోసం మూడు వరసల దర్శనం క్యూ లైన్ ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్ కు సూచించారు. లడ్డు ప్రసాదం, కొబ్బరి కాయలు కొట్టే స్థలంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటున్నందున రోప్ పార్టీ పోలీసులను ఏర్పాటు చేయాలని డి.ఎస్.పి కి సూచించారు. సి.సి. రోడ్డు పూర్తయినందున కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి నుండి భక్తులు జాతరకు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశమున్నందున పార్కింగ్ కు ఇబ్బందుల కలగవచ్చని, ట్రాఫిక్ ను పాపన్నపేట మండలం నాగసానపల్లి నుండి తరలించుటకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. జాతర అంతటా గట్టి పొలిసు బందోబస్తు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని పొలిసు, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. రెండు రోజుల ముందుగా సింగూరు నుండి ఘనపూర్ ఆయకట్టు కు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారిని, వంద మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయవలసినదిగా మత్స్య శాఖ అధికారిని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో నేలను మొరం మట్టితో చదును చేయాలని పంచాయత్ రాజ్ అధికారులకు సూచించారు. అంతకుముందు పొలిసు, రెవిన్యూ , ఆర్ అండ్ బి, నీటిపారుదల శాఖాధికారులు ప్రమాద ప్రాంత్రాలను గుర్తించి బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని, భక్తులు ఈత కొట్టకుండా చూడాలని అన్నారు. గతంలో మాదిరే భక్తులకు ఇబ్బంది కలగకుండా మంచి నీటి కుళాయిలు, ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని, స్నానాలు చేయుటకు షవర్లు, మహిళలు బట్టలు మార్చుకొనుటకు గదులు, శౌచాలయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో ప్రధాన సమస్య శానిటేషన్ అని కానీ గత సంవత్సరం బాగా చేశామని, అదే స్ఫూర్తితో శానిటేషన్ పనులు చేపట్టాలని దాకా సంఖ్యలో డ్రమ్ములు ఏర్పాటుచేసి, ట్రాక్టర్ ల ద్వారా చెత్తను తరలించాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించించారు. 5 ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తూ అన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు కరోనా రెండవ డోసు వేయడానికి వ్యాక్సిన్ సిద్ధంగా ఉంచుకోవాలని, 5 అంబులెన్స్ లు ఏర్పాటు చేయాలని డి.ఎం. అండ్ హెచ్.ఓ. కు సూచించారు. జిల్లా నలుమూలల నుండి భక్తులు తరలివచ్చేందుకు 140 ఆర్.టి.సి. బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, బస్టాండ్ ల నుండి దేవస్థానం వరకు ఉచిత బస్సులు నడుపుతామని అన్నారు. ఓవర్ లోడ్ పడకుండా విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన ఫీడర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఎస్.ఈ. కి సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు రెండు వాహనాలు, బులెట్ వాహనాలు ఏర్పాటు చేయాలని అగ్నిమాపక అధికారికి, ఆరోగ్యమైన జీవాల మాంసం అమ్మేలా చూడాలని పశు సంవర్ధక శాఖా అధికారికి, అక్రమ మద్యం అమ్మకాలు జరుగకుండా చూడాలని ఆబ్కారీ శాఖాధికారికి, వ్యాపారులు ఇష్టం వచ్చిన ధరలకు వస్తువులు విక్రయించకుండా, తూకాలలో మోసం చేయకుండా పరిశీలించాలని ఫుడ్ ఇన్స్పెక్టర్ కు, చెట్లు నరకకుండా చూడాలని అటవీ అధికారులకు సూచించారు. జాతర ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసే జాయింట్ వీల్ వంటి యంత్రాల బిగింపు,పనితీరు సరిగ్గా ఉన్నదా పరిశీలించి అనుమతులు ఇవ్వాలని సూచించారు. భక్తుల కాలక్షేపానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆలయ ఈ.ఓ. కు సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్, డిఎస్పీ సైదులు, ఆర్.డి.ఓ.లు సాయి రామ్, వెంకట ఉపేందర్ రెడ్డి, ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పుట్టినరోజు భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 15:ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. హాస్పిటల్ లో రోగులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. హాస్పిటల్ ని పరిశీలించి, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం దేవరుప్పులలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి. నియోజకవర్గంలోని కొడకండ్ల, పెద్ద వంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల్లోనూ సీఎం కెసిఆర్ జన్మదిన వేడుకల్లో సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎం కెసిఆర్ పుట్టిన రోజు అంటే, మనందరికీ పుట్టిన రోజు..కెసిఆర్ పుట్టిన రోజును మనమంతా పండుగ లాగా చేసుకోవాలి.. కేసీఆర్ కారణజన్ముడు..తెలంగాణ ప్రజల 60 ఏండ్ల కలను నిజం చేసిన మహానుభావుడు..కేసిఆర్ గారు తెలంగాణ గాంధీ?ఒకటి కాదు రెండు కాదు ఈ రోజు.. తెలంగాణ పల్లెలన్నీ ఆదర్శ గ్రామాలే..పల్లె ప్రగతి ప్రదాత కెసిఆర్ గారు చూపిన బాటలో ఇవ్వాళ పల్లెలన్నీ పచ్చగా, పరిశు భ్రంగా, స్వయం సమృద్ధిగా తయారయ్యాయి..



తెచ్చిన తెలంగాణను, అభివృద్ధి చేస్తూ, అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన నిజమైన నేత, అభివృద్ధి ప్రదాత కెసిఆర్..కరువు కాటకాలతో నెర్రెలు బారిన నేలను సస్యశ్యామలం చేసిన ఘనత కెసిఆర్ దే అన్నారు. తెలంగాణను కోటిన్నర ఎకరాల మాగాణగా మార్చింది కెసిఆర్..సాగునీటిని కాలువల ద్వారా మన పంట పొలాలకు తరలించి?.మంచి నీటిని నల్లాల ద్వారా మన ఇంటింటికీ పంపించిన అపర భగీరథుడు..పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, బర్రెలు, గొర్లు, మేకలు, చేపలు, చదువులు, ఆరోగ్యం పుట్టుకకు ముందు చావు తర్వాత కూడా అన్నీ సబ్బండ వర్గాలకు సంక్షేమ సారథి అయ్యారు..పంటకు పెట్టుబడి, రైతుకు బీమా, రుణాల మాఫీ, కోతలు లేని 24 గంటల కరెంట్ పంటల కొనుగోలుతో రైతుల ఆత్మ బంధువు అయ్యారు..దళితుల పాలిట దళిత బంధువు అయ్యారు..ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ బర్త్‌డే వేడుకలలో భాగంగా మానసిక వికలాంగులకు కొత్త బట్టలు పంపిణీ

వరంగల్, ఫిబ్రవరి 15:: సీఎం కేసీఆర్ బర్త్‌డే వేడుకల నేపథ్యంలో మంగళవారం బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో మానసిక వికలాంగులైన బాల, బాలికలకు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ కొత్త బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, వరంగల్ నగర మున్సిపల్ కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్ రావు, సీనియర్ నాయకులు శోభన్, అనిల్ రావు, రంజిత్, పద్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈనెల 17 వ తేదీన సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా ముందస్తుగా మూడు రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బాలసముద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# డిజిటల్ లావాదేవీలు ఎంతో సులభతరం, సురక్షితం..!!

## -జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ .

మెదక్, ఫిబ్రవరి 15(నేటినిజం ప్రతినిధి ) డిజిటల్ లావాదేవీలు ఎంతో సులభ తరం, సురక్షితమని జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ అన్నారు. గో డిజిటల్ గో సెక్యూర్ అనే అంశంతో 2020-2025 నాటికి దేశమంతటా ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగించి నగదు రహిత డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలన్న సంకల్పంతో భారతీయ రిజర్వు బ్యాంక్ ఈ నెల 14 నుండి 18 వరకు ఫైనాన్సియల్ లిటరసీ వారోత్సవాలు నిర్వహిస్తున్నదని అన్నారు. అందులో భాగంగా ముద్రించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్, నాబార్డు ఏ.జి.ఎం. సెసిల్ తిమోతి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ రావు, ఆర్.డి.ఓ. సాయి రామ్, డి.ఆర్.డి.ఓ. అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ భీమయ్య తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయా స్థాయిలో ప్రజలను ఆర్థిక అక్షరాస్యత వైపు నడిపించాలని వ్యూహంతో రిజర్వు బ్యాంకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఇప్పుడు మీ చేతి వేళ్ళ ద్వారా డిజిటల్ బ్యాంకింగ్ ను 365 రోజులు 24 గంటలు నెఫ్ట్/ ఆర్.టి.జి.ఎస్./ ఐ.ఎం.పి. స్.,/యు.పి .ఐ. ల ద్వారా నగదు రహిత లావాదేవీలు నిర్వహించుకోవచ్చని అన్నారు.

# హనుమాన్ గుడిలో ఎమ్మెల్యే నరేందర్ పూజలు



వరంగల్, ఫిబ్రవరి 15:రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని వరంగల్ తూర్పు నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో సిటీ హనుమాన్ గుడిలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే 1000 మంది దివ్యాంగులు, వృద్ధులు, అనాథలకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నదానం చేశారు.

# కడప జిల్లా సూపరింటెండెంట్ వరుణారెడ్డి బదిలీ

అమరావతి, ఫిబ్రవరి 15:ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాలకు చెందిన జైలు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వరుణారెడ్డిని ఒంగోలు జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఒంగోలు జైలర్ ప్రకాశ్‌ను కడప జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఏపీ డీజీపీని బదిలీ చేసిన కొద్ది నిమిషాల్లోనే జైలర్ల బదిలీ ఏపీలో చర్చాంశనీయంగా మారింది. అయితే టీడీపీ నాయకుడు చంద్రబాబు కడప జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వరుణారెడ్డిపై ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలో వరుణారెడ్డి బదిలీ జరగడం గమన్హారం.

# లెక్కల టీచర్ దారుణం.. విద్యార్థిని కొట్టడంతో కోమాలోకి..

అమరావతి, ఫిబ్రవరి 15:చిత్తూరు జిల్లా పలమనేరులో ఓ విద్యార్థిపై ఉపాధ్యాయుడు దారుణంగా ప్రవర్తించాడు. జ్వరంతో బాధపడుతున్న స్టూడెంట్?పై లెక్కల మాస్టారు ప్రతాపం చూపాడు. తలను డెస్క్ కు వేసి బాదడంతో కోమాలోకి వెళ్లిన ఘటన జరిగింది.. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

పలమనేరు మండలం జరావారిపల్లెకు చెందిన కామేశ్వరరెడ్డి కుమారుడు రోహిత్ కుప్పం రహదారి ప్రక్కన ఉన్న ఈమాస్విస్ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం క్రితం పాఠశాలకు వెళ్లిన రోహిత్‌కు జ్వరం రావడంతో తరగతి గదిలో వెనుక వైపు ఉన్న డెస్క్‌పై పడుకున్నాడు. లెక్కల మాస్టర్ జ్యోతీశ్వర్ అది గమనించి దగ్గరకు పిలిచారు. రోహిత్ ఒంటిని తాకి జ్వరం లేదు తప్పు చెబుతావా అంటూ.. ఆ విద్యార్థి తలను వంచి టేబుల్‌పైకి కొట్టడంతో పాటు, వెనుకవైపు మళ్లీ తలపై కొట్టాడు.

దీంతో రోహిత్ ఇంటికి వెళ్లి పడకేశాడు. మంగళవారం మళ్లీ జ్వరం రావడంతో పాటు కాళ్లూ చేతులు పనిచేయకపోవడంతో పలమ నేరులోని ఓ క్లినిక్‌లో తల్లిదండ్రులు చూపించారు.మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించడంతో రోహిత్‌ను స్విమ్స్‌లో చేర్పించారు. ఆదివారం వరకు కూడా రోహిత్ కోలుకోక పోవడంతో గ్రామస్థులు, రోహిత్ బంధువులు పాఠశాల వద్దకు వెళ్లి యాజమాన్యాన్ని నిలదీశారు. విద్యార్థి వైద్య పరీక్షలకయ్యే వ్యయాన్ని భరిస్తామని, జ్యోతీశ్వర్‌ను సస్పెండ్ చేశామని చెప్పి సర్ది చెప్పారు. దీనిపై డిప్యూటీ ఎడ్యుకేషనల్? ఆఫీసర్? పురుషోత్తం మంగళవారం ఈమాస్విస్ పాఠశాలకు చేరుకొని పాఠశాల యాజమాన్యంతో విచారణ చేపట్టారు.

# 'న్యూస్ఆన్ ఎయిర్' రేడియో లైవ్-స్ట్రీమ్ గ్లోబల్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:'న్యూస్ఆన్ ఎయిర్' యాప్‌లో అగ్ర ఆల్ ఇండియా రేడియో లైవ్ స్ట్రీమ్‌లకు సంబంధించిన.. ఆయా దేశాలతో కూడిన తాజా "న్యూస్ఆన్ ఎయిర్ గ్లోబల్ ర్యాంకింగ్"లను ప్రకటించారు. భారత రాజధాని నుండి ప్రసారమయ్యే 'ఎఫ్ఎం గోల్డ్ ఢిల్లీ'తో సహా పలు ఆల్ ఇండియా రేడియో సేవలు ప్రపంచంలో బాగా ప్రాచుర్యం పొందాయని ఇందులో వెల్లడయింది. న్యూస్ఆన్ ఎయిర్ యాప్‌లో ఆల్ ఇండియా రేడియో లైవ్ స్ట్రీమ్‌లు అత్యంత ప్రజాదరణ పొందిన.. ప్రపంచంలోని అగ్ర దేశాల తాజా ర్యాంకింగ్‌లలో (భారతదేశం మినహా) అమెరికా (యునైటెడ్ స్టేట్స్), కెనడా, ఆస్ట్రేలియా చార్ట్‌లలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆల్ ఇండియా రేడియో స్ట్రీమ్‌లలో (భారతదేశం మినహా) వివిధ్ భారతి నేషనల్ ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా వినిపించే ఆల్ ఇండియా రేడియో సేవగా నిలిచింది. ఆల్ ఇండియా రేడియో యొక్క 240 కంటే ఎక్కువ రేడియో సేవలు ప్రసార భారతి యొక్క అధికారిక యాప్ అయిన "న్యూస్ఆన్ ఎయిర్ యాప్"లో ప్రత్యక్ష ప్రసారమవుతున్నాయి. న్యూస్ఆన్ ఎయిర్ యాప్‌లో ఆల్ ఇండియా రేడియో స్ట్రీమ్‌లు భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 85 కంటే ఎక్కువ దేశాలలో పెద్ద సంఖ్యలో శ్రోతలను కలిగి ఉన్నాయి. భారతదేశంలోనే కాకుండా న్యూస్ఆన్ఎయిర్ యాప్‌లో ఏఐఆర్ లైవ్ స్ట్రీమ్‌లు అత్యంత జనాదరణ పొందిన అగ్ర దేశాల గురించి ఇక్కడ ఒక సంగ్రహావలోకనం ఇవ్వబడింది; ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలలో న్యూస్ఆన్ ఎయిర్‌యాప్‌లో అగ్ర ఆల్ ఇండియా రేడియో ప్రసారాలు ఇవ్వబడ్డాయి. దేశ వారీగా సమాచారాన్ని కూడా చూపిస్తుంది. ఈ ర్యాంకింగ్‌లు జనవరి 1 నుండి జనవరి 31, 2022 వరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా కేటాయించబడ్డాయి.

# పట్టణ స్థానిక సంస్థల కోసం రాష్ట్రాలకు రూ.1154.90 కోట్లు గ్రాంట్ విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు అందించడానికి 4 రాష్ట్రాలకు రూ. 1154.90 కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ (రూ. 225.60 కోట్లు), బీహార్ (రూ. 769 కోట్లు), గుజరాత్ (రూ. 165.30 కోట్లు), సిక్కిం (రూ. 5 కోట్లు) రాష్ట్రాలకు ఈ గ్రాంట్లు విడుదల చేసింది. . విడుదల చేసిన గ్రాంట్లు కంటోన్మెంట్ బోర్డులతో సహా నాన్-మిలియన్ ప్లస్ సిటీస్ (ఎన్ఎంపిసిలు) కోసం ఉద్దేశించబడ్డాయి.

15వ ఆర్థిక సంఘం 2021-22 నుండి 2025-26 వరకు తన నివేదికలో పట్టణ స్థానిక సంస్థలను రెండు వర్గాలుగా విభజించింది: (ఎ) మిలియన్-ప్లస్ పట్టణ సముదాయాలు/నగరాలు (ఢిల్లీ మరియు శ్రీనగర్ మినహా), మరియు (బి) మిగిలిన అన్ని ఒక మిలియన్ కంటే తక్కువ జనాభా ఉన్న ఇతర నగరాలు మరియు పట్టణాలు (మిలియన్ ప్లస్ కాని నగరాలు). 15వ ఎఫ్‌సి వారికి ప్రత్యేక గ్రాంట్‌లను సిఫార్సు చేసింది. నాన్-మిలియన్ ప్లస్ నగరాల కోసం కమిషన్ సిఫార్సు చేసిన మొత్తం గ్రాంట్‌లలో, 40% ప్రాథమిక (అన్‌టైడ్) గ్రాంట్ మరియు మిగిలిన 60% టైడ్ గ్రాంట్. జీతం చెల్లింపు మరియు ఇతర స్థాపన ఖర్చులు మినహా, ప్రాథమిక గ్రాంట్లు (అన్‌టైడ్) స్థాన నిర్దిష్ట అవసరాల కోసం ఉపయోగిస్తారు

మరోవైపు, ప్రాథమిక సేవల డెలివరీకి మద్దతు ఇవ్వడం మరియు బలోపేతం చేయడం కోసం మిలియన్ ప్లస్ కాని నగరాల కోసం టైడ్ గ్రాంట్‌లు విడుదల చేశారు. మొత్తం టైడ్ గ్రాంట్‌లో, 50% 'శానిటేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మరియు మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ డ అర్బన్ అఫైర్స్ అభివృద్ధి చేసిన స్టార్ రేటింగ్‌ల కోసం కేటాయించబడింది. మిగిలిన 50% 'తాగునీరు, వర్షపు నీటి సంరక్షణ మరియు నీటి రీసైక్లింగ్‌తో ముడిపడి ఉంది.

వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద పారిశుధ్యం, తాగునీటి కోసం కేంద్రం, రాష్ట్రం కేటాయించిన నిధుల కంటే పట్టణ స్థానిక సంస్థలకు అదనపు నిధుల లభ్యతను నిర్ధారించడానికి,పౌరులకు నాణ్యమైన సేవలను అందించడానికి టైడ్ గ్రాంట్లు ఉద్దేశించినవి.

# నకిలీ సర్టిఫికెట్లతో ఉన్నత విద్య భ్రష్టు : సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 15: నకిలీ సర్టిఫికెట్లతో ఉన్నత విద్యను భ్రష్టు పట్టించేలా కొందరు వ్యవహరిస్తున్నారని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. హైదరాబాద్‌లో నకిలీ సర్టిఫికెట్లు తయారీ చేస్తున్న 10 మంది సభ్యుల అంతర్ రాష్ట్ర ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మలక్‌పేట, ఆసిఫ్‌నగర్ పోలీసు స్టేషన్ల పరిధిలో పలువురిని ముఠా సభ్యులు మోసం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. దేశంలోని వివిధ వర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మీడియాకు వివరాలను వెల్లడించారు. మలక్‌పేటలో శ్రీసాయి ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ పేరుతో శ్రీకాంత్ సంస్థను నిర్వహిస్తున్నాడు. డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి, నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాడు. ఒక్కో డిగ్రీ సర్టిఫికెట్‌కు రూ. లక్ష వసూలు చేస్తున్నారని సీపీ తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లు తీసుకున్న విద్యార్థులను కూడా అరెస్టు చేశామని పేర్కొన్నారు. భోపాల్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్సిటీ నుంచి నకిలీ సర్టిఫికెట్లు జారీ అయినట్లు గుర్తించామన్నారు. ఆ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేతన్ సింగ్ సాయంతో డిగ్రీ పట్టాలు జారీ అయ్యాయి. వర్సిటీకి చెందిన ఇతన ఉన్నతాధికారుల హస్తం కూడా ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలు సేకరిస్తున్నామని తెలిపారు. బీటెక్ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు లక్షల్లో డబ్బులు ఇచ్చారు. తీసుకున్న డబ్బుల్లో 30 శాతం శ్రీకాంత్, 70 శాతం నగదు కేతన్ సింగ్ తీసుకున్నట్లు తేలింది అని సీపీ స్పష్టం చేశారు.

అత్తాపూర్‌లో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న మహేశ్వర్ కూడా కేతన్ సింగ్‌తో చేతులు కలిపాడు. మహేశ్వర్ ఇతర వర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించాడు. ఈయన ఏజెంట్ల ద్వారా విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశాడు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇలాంటివి పలు సంస్థలు ఉన్నాయి. నకిలీ సర్టిఫికెట్ల నివారణకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చర్యలు తీసుకుంటోందన్నారు. నకిలీ సర్టిఫికెట్ల విచారణకు డీఐజీ రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు.

# మానవత్వం చాటుకున్న మంత్రి గంగుల

సిద్దిపేట , ఫిబ్రవరి 15:రామునిపట్ల సమీపంలో కారు ప్రమాదం జరిగింది, ఆ మార్గంలో హైదరాబాద్ వెళ్తున్న రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ ఘటనను చూసి వెంటనే ఆగారు. కారు ప్రమాదం లో గాయపడిన వారిని చూసి హుటా హుటిన స్పందించి తన కార్ లో, తన వ్యక్తి గత సిబ్బందిని తోడుగా పంపి సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకి మెరుగైన వైద్యం కోసం పంపించారు. అక్కడి డాక్టర్లతో మాట్లాడి సరైన వైద్య సాయం అందించాలని ఆదేశించారు. స్విఫ్ట్ డిజైర్ కారును నడుపుతున్న వ్యక్తి అదుపుతప్పి కల్వర్టుకు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

స్థానికుల సహాయంతో వారిని కాపాడి ఆసుపత్రికి పంపిచారు. కారును నడుపుతున్న వ్యక్తి అతని భార్య , కూతురు, అల్లుడు, మరొకరు మొత్తం ఐదుగురు ఉన్నారు బాధితులు హైదరాబాద్ వాసులు కాగా కరీంనగర్ కు ఫంక్షన్ వెళ్లి తిరిగి హైదరాబాద్ వస్తుండగా ఈ ఘటన జరిగింది.

# మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కి కరోనా

మధ్యప్రదేశ్, ఫిబ్రవరి 15ఫబిజెపి సీనియర్ నేత, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కి కరోనా పాజిటీవ్ గా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని ఆయన స్వయంగా ట్వీట్ చేశారు. తేలికపాటి లక్షణాలు ఉన్నందున ఆయన ఇంట్లో ఐసోలేషన్‌లో ఉంటున్నారు. రాబోయే రోజుల్లో అన్ని పనులను వర్చువల్‌గా చేస్తానని? రేపు, సంత్ శిరోమణి రవిదాస్ జయంతి కార్యక్రమంలో కూడా తాను వర్చువల్‌గా పాల్గొంటానని శివరాజ్‌సింగ్ చౌహాన్ ట్వీట్‌లో పేర్కొన్నారు. అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# ఎబి- పిఎంజేఏవై అమలుకు డేటాబేస్‌ను పటిష్ట పరిచే లక్ష్యంతో వివిధ పథకాల క్రింద లబ్ధిదారుల డేటాబేస్‌తో ఏకీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఎ) ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి ? జన్ ఆరోగ్య యోజన (ఎబి- పిఎంజేఏవై) అమలుతో తప్పనిసరి చేయబడింది. ఎబి- పిఎంజేఏవై ప్రతి కుటుంబానికి ద్వితీయ మరియు తృతీయ సంరక్షణ సంబంధిత ఆసుపత్రిలో చేరడం కోసం ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.5 లక్షల వరకూ ఆరోగ్య హామీని అందిస్తుంది. ఎబి- పిఎంజేఏవై కింద 10.74 కోట్ల మంది లబ్ధిదార కుటుంబాలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో

సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ)2011 ఆధారంగా 6 మరియు 11 వృత్తిపరమైన ప్రమాణాల ఆధారంగా గుర్తించబడ్డాయి.

ఇంటర్ ఎలియా బెనిఫిషియరీ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లు, బెనిఫిషియరీ డేటాబేస్ (ఎస్ఈసీసీ 2011) ఎన్‌రిచ్‌మెంట్ మొదలైనవాటితో సహా పథకం అమలులోని విభిన్న అంశాలను బలోపేతం చేయడానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వివిధ మంత్రిత్వ శాఖలతో ఎన్‌హెచ్ఏ సహకరించింది. ఎబి- పిఎంజేఏవై కింద లబ్ధిదారుల డేటాబేస్ ఎన్‌రిచ్‌మెంట్ అంటే డేటాబేస్ కోసం అదనపు పారామితులను జోడించడం. శోధన సౌలభ్యం. ఎస్ఈసీసీ 2011 నుండి ఎబి- పిఎంజేఏవై లబ్ధిదారులలో ఎక్కువ మంది కూడా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ పోర్టల్ (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద ప్రయోజనాలకు అర్హులు.ఎన్‌హెచ్ఏ ఎస్ఈసీసీ 2011 లబ్ధిదారుల డేటాబేస్‌ను ఎన్ఎఫ్ఎస్ఏతో ఏకీకృతం చేయడంపై పని చేస్తోంది. ఇది లబ్ధిదారులు వారి రేషన్ కార్డ్ నంబర్‌ను ఉపయోగించి ఎబి- పిఎంజేఏవై కింద వారి అర్హతకు సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు వీలు కల్పిస్తుంది. అర్హులైన లబ్ధిదారులకు పథకం మరియు అర్హతకు సంబంధించిన సమాచారాన్ని అందించడానికి సరసమైన ధరల దుకాణాలు లేదా రేషన్ దుకాణాలను ఉపయోగించాలనే ప్రతిపాదనపై కూడా ఎన్‌హెచ్ఏ పని చేస్తోంది. ఇది ఇప్పటికే ఉన్న కామన్ సర్వీస్ సెంటర్, యూటీఐ-ఐటీఎస్ఎల్ మొదలైన వాటితో పాటుగా లబ్ధిదారులకు కార్డ్ క్రియేషన్ కోసం అదనపు మార్గాన్ని అందిస్తుంది. ఇది లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను చాలా సౌకర్యవంతంగా చేస్తుంది.

ఏదేమైనప్పటికీ వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అందుబాటులో ఉన్న ప్రస్తుత లబ్ధిదారుల డేటా సాధారణ గుర్తింపుదారు అందుబాటులో ఉన్నట్లయితే మాత్రమే అర్థవంతంగా వినియోగించబడుతుంది. మెజారిటీ ప్రభుత్వ డేటాబేస్‌లలో ఆధార్ ఒక సాధారణ గుర్తింపుగా ఉండటం ఈ ఏకీకరణను ప్రారంభిస్తుంది. ఇంకా, ఈ-కేవైసి ద్వారా లబ్ధిదారుల గుర్తింపుకు సంబంధించి కూడా ఆధార్ ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తుంది. ఈ-కెవైసీ టార్గెటెడ్ పద్ధతిలో పేపర్‌లెస్ సర్వీస్‌ల డెలివరీని అనుమతిస్తుంది.

ఈ క్రమంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడిఏఐ) 27 అక్టోబర్ 2021, 6 డిసెంబర్ 2021 మరియు 14 డిసెంబర్ 2021 తేదీలతో ఓఎంలను జారీ చేసింది. ఈ ఓఎంలు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య ఆధార్ (ఏదైనా పథకం కింద సేకరించబడినవి) భాగస్వామ్యం చేయడాన్ని ప్రారంభించాయి. ఓఎం ప్రకారం, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలు, సెక్షన్ 7 లేదా సెక్షన్ 4(4)(బి(తితి) పథకాలను నిర్వహించడం, ఆధార్ (ఆర్థిక మరియు ఇతర రాయితీల లక్ష్య డెలివరీ, ప్రయోజనాలు మరియు సేవలు) చట్టం, 2016.

దీని ప్రకారం, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ (డిఓఎఫ్‌పిడి) 06 జనవరి 2022 తేదీన ఓఎం ఫైల్ నం.14(1)/2018-అనీఎ.అవశ్రీశ్రీ (ఈ-342358)ని జారీ చేసింది. దీనిలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు అవసరమైన సహాయం మరియు సహకారాన్ని అందించాలని అభ్యర్థించారు. సంబంధిత ఆధార్‌తో పాటు ఎన్ఎఫ్ఎస్ఏ రేషన్ కార్డ్ డేటాను ఎన్‌హెచ్ఏతో పంచుకోవడం, డేటా రక్షణ, డేటా నిల్వ మరియు డేటా గోప్యత మొదలైన వాటికి సంబంధించిన వివిధ నిబంధనలు మరియు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మరియు ప్రత్యేకించి, సమ్మతి కోరడం వినియోగదారు విభాగాలపై ఉంటుంది.

డిఓఎఫ్‌పిడీ యొక్క ఓఎంని అనుసరించి డేటాబేస్ ఏకీకరణకు సంబంధించి రాష్ట్రాలు/యూటీలతో ఎన్‌హెచ్ఏ అనుసరిస్తోంది. రాష్ట్రాలు మరియు యుటిలు ఈ విషయంలో అవసరమైన సహాయం అందిస్తున్నాయి. డేటాను పంచుకోవడంలో రాష్ట్రాలు లేదా యూటీలు ఏవీ ఎన్‌హెచ్ఏకి ఎలాంటి రిజర్వేషన్‌ను వ్యక్తం చేయలేదు. డేటాబేస్ షేరింగ్ ప్రక్రియ ఇప్పటికే అనేక రాష్ట్రాలు/యూటీలలో ప్రారంభించబడింది.

# శీతాకాలం నుంచి పర్యాటక ఆకర్షణగా లడఖ్‌లో మంచు శిల్ప కళాకృతుల ప్రదర్శన - కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ శీతాకాలం నుంచి లడఖ్ లో మంచు శిల్ప కళాకృతుల ప్రదర్శనను నిర్వహిస్తామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, సిబ్బంది వ్యవహారాల, పెన్షన్లు, అంతరిక్ష, అణుశక్తి మంత్రిత్వ శాఖ సహాయ (స్వతంత్ర బాధ్యత) మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. కేంద్రపాలిత లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ ఆర్.కే .మాథుర్ తో లడఖ్ కు సంబంధించి పరిపాలన, అభివృద్ధి అంశాల పై డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ జితేంద్ర సింగ్ పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ శీతాకాలం నుంచి లడఖ్ లో మంచు శిల్ప కళాకృతుల ప్రదర్శనను నిర్వహిస్తామని తెలిపారు. దీనివల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు.

ప్రపంచంలో ఆదరణ పొందిన మంచు శిల్ప కళాకృతుల కళను లడఖ్‌లో నిర్వహించేందుకు సీఎస్ఐఆర్ నుంచి సహకారం అందించాలని మంత్రికి లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ ఆర్.కే .మాథుర్ విజ్ఞప్తి చేశారు. ఈ కళను స్థిరీకరించిన తర్వాత రాబోయే సంవత్సరాల్లో లడఖ్ లో ఐస్ అండ్ స్నో స్కల్ప్చర్ ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

మంచు కళాకృతుల ఉత్సవ నిర్వహణపై నిర్వహించిన ముగింపు సమావేశం 2022 ఫిబ్రవరి 11న జరిగింది. లడఖ్ పోలీస్ సహకారంతో దీనిని కాంగ్సింగ్ స్నో అండ్ ఐస్ స్కల్ప్చర్ అసోసియేషన్ చిల్లింగ్‌కు వెళ్లే మార్గంలో సోగ్స్టి సమీపంలోని సంగ్‌తక్చాన్‌లో నిర్వహించింది. ముగింపు సమావేశంలో లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ ఆర్.కే .మాథుర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ మాథుర్ శీతాకాలంలో లడఖ్‌ను వదిలి వెళ్లకుండా ఆదాయం ఆర్జించేందుకు ప్రయత్నించాలని అన్నారు.

వాణిజ్య అవసరాల కోసం "లేహ్ బెర్రీ" సాగును చేపట్టాలని నిర్ణయించిన లడఖ్ పరిపాలనా యంత్రాంగాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. "లేహ్ బెర్రీ" వాణిజ్య సాగు ఈ ఏడాది ఏప్రిల్-మే నెలలో ప్రారంభమవుతుంది. శీతల ప్రాంతాల్లో మాత్రమే పండే "లేహ్ బెర్రీ" ఉత్పత్తులను కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్( సీఎస్ఐఆర్ ) ప్రోత్సహిస్తోంది. దీనివల్ల పారిశ్రామికవేత్తలకు అనేక అవకాశాలు లభించడంతో స్థానికులకు జీవనోపాధి లభిస్తుంది. "లేహ్ బెర్రీ"కు మూలాధారమైన 'సీ బక్‌థార్న్'ను విస్తృతంగా సాగు చేయాలని 2018 మే నెలలో తన లడఖ్ పర్యటనలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సూచించిన అంశాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా గుర్తు చేసారు. స్థానిక రైతులు, స్వయం సహాయక బృందాలు ఉపయోగించడానికి అనువుగా ఉండే పరికరాలను సీఎస్ఐఆర్ రూపొందించి అభివృద్ధి చేస్తుందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం వైల్డ్ సీ బక్‌థార్న్ ప్లాంట్ నుండి 10% కాయలు మాత్రమే తీస్తున్నారని మంత్రి అన్నారు.

వైల్డ్ సీ బక్‌థార్న్ ఉపయోగించి జామ్‌లు, జ్యూస్‌లు, హెర్బల్ టీ, విటమిన్ సి పోషకాలు , హెల్త్ డ్రింక్, క్రీమ్, ఆయిల్, సబ్బులు వంటి 100 రకాల ఉత్పత్తులను ఉత్పత్తి చేసి, విక్రయించేందుకు స్థానిక పారిశ్రామికవేత్తలకు సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. సేంద్రీయ పద్ధతుల్లో సాగే ఈ కార్యక్రమాల వల్ల ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు.

ఈ వసంత రుతువులో 15,000 అడుగుల ఎత్తులో వాణిజ్యపరంగా మూడు ఔషధ మొక్కల పెంపకం ప్రారంభమవుతుందని శ్రీ మాథుర్ తెలియజేశారు. ఇందులో "సంజీవని బూటీ" కూడా ఉంది. దీనిని స్థానికంగా "సోలా" అని పిలుస్తారు, ఇది చాలా ప్రాణాలను రక్షించే మరియు చికిత్స లక్షణాలను కలిగి ఉంది.

పండ్లు మరియు కూరగాయల సంరక్షణ/జీవిత కాలం పొడిగింపు కోసం లడఖ్ లో గామా రేడియేషన్ టెక్నాలజీ తో అణుశక్తి మంత్రిత్వ శాఖ సౌకర్యాలను ఏర్పాటు చేస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలియజేశారు. దుబాయ్‌కి తొలిసారిగా భారీ మొత్తంలో నేరేడు పండు ఎగుమతి కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ప్రసిద్ధ పాష్మినా మేకల వ్యాధుల చికిత్స కోసం లేహ్ మరియు కార్గిల్‌లో ఒక్కొక్కటి రెండు చొప్పున 4 శిక్షణా వర్క్‌షాప్‌లను నిర్వహించిన సీఎస్ఐఆర్ ను డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. లడఖ్‌లోని చార్తాంగ్‌లో 4 లక్షలకు పైగా జంతువులు ప్రధానంగా పష్మినా మేకలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలు జీవనోపాధికి ఎక్కువగా పొందుతున్నారు.

పష్మినా మేకలు, గొర్రెలు మరియు జడల బర్రె లలో జింక్ విలువలు అంచనా వేయడానికి సీఎస్ఐఆర్ సీనియర్ శాస్త్రవేత్తల ఉన్నత స్థాయి బృందం ఈ వేసవిలో లడఖ్‌ను సందర్శిస్తుందనిశ్రీ మాథుర్ కు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

కొత్తగా ఏర్పాటైన కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్ అభివృద్ధికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. లడఖ్ లో విశ్వవిద్యాలయం, వృత్తి విద్యా కళాశాలలు మరియు ఇతర సంస్థల ఏర్పాటుకు అనుమతులు మంజూరు అయ్యాయని అన్నారు. జోజిలా పాస్‌ను ప్రారంభించడం స్థానిక ప్రజలకు ఎంతో ఊరటనిస్తోందన్నారు.

సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదుల మంత్రిత్వ శాఖ ద్వారా అధికారులు మరియు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వం చేసిన అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన మంత్రికి లెఫ్టినెంట్ గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదుల మంత్రిత్వ శాఖ ఇప్పటికే రెండు విస్తృతమైన శిక్షణా సమావేశాలు నిర్వహించింది. కొత్త కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టులు, పథకాలను ప్రారంభించిన దృష్ట్యా లడఖ్‌లో ఎక్కువ సంఖ్యలో ఐఏఎస్ క్యాడర్ అధికారులను నియమించాలని కూడా ఆయన అభ్యర్థించారు.

ప్రతి సమస్య పరిష్కారం కోసం సహకారం అందిస్తున్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు లెఫ్టినెంట్ గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు.

# సర్వోదయ మిత్రమండలి సేవలు అభినందనీయం



వరంగల్, ఫిబ్రవరి 15:సర్వోదయ మిత్రమండలి సేవలు అభినందనీయమని కలెక్టర్ అన్నారు. మేడారం జాతరలో విధులు నిర్వహించే సిబ్బందికి పీపీఈ కిట్లు, ఆక్సీ మీటర్లు కలెక్టర్ కు ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ అందజేశారు. స్వర్గీయ మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ ఆశయాలకు అనుగుణంగా వ్యవస్థాపక అధ్యక్షులు, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ సారథ్యంలో సర్వోదయ మిత్రమండలి పనిచేస్తుంది. మేడారం జాతర సందర్భంగా దాస్యం అభినవ్ భాస్కర్ దాదాపు రూ.30 లక్షల విలువ చేసే నాలుగువేల ఐదు వందల పీపీఈ కిట్లు, వెయ్యి ఆక్సి మీటర్లను జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ సమక్షంలో అందించారు.

# భారత్‌పై అమెరికా ప్రశంసల వర్షం

వాషింగ్టన్ ,ఫిబ్రవరి 15:క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డయలాగ్ (క్వాడ్) చోదక శక్తి, ప్రాంతీయాభివృద్ధికి ఇంజిన్ భారత దేశమని అమెరికా పేర్కొంది. భారత దేశం తమకు భావసారూప్యతగల భాగస్వామి అని, హిందూ మహాసముద్రం, దక్షిణాసియాలో నాయకత్వ పాత్రలో ఉందని, ఆగ్నేయాసియాలో చురుగ్గా ఉంటూ, ఆ దేశాలతో అనుబంధాన్ని కలిగియుందని పేర్కొంది. వైట్ హౌస్ ప్రిన్సిపల్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ కరినే జీన్-పియర్రే విలేకర్ల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా కలిసి క్వాడ్‌గా ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ నాలుగు దేశాల విదేశాంగ మంత్రులు ఇటీవల ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో సమావేశమయ్యారు. ఇండో-పసిఫిక్‌లో చైనా ప్రాబల్యం పెరుగుతుండటంతోపాటు అనేక అంశాలపై చర్చలు జరిపారు. ఉక్రెయిన్‌పై రష్యా, పాశ్చాత్య దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు కూడా చర్చకు వచ్చాయి.

నిర్బంధాల నుంచి ఇండో-పసిఫిక్‌కు విముక్తి కల్పించడం కోసం సహకారాన్ని విస్తరించుకోవాలని విదేశాంగ మంత్రులు నిర్ణయించారు. ఇతర దేశాలను బెదిరించడానికి లేదా దాడి చేయడానికి ఆఫ్ఘనిస్థాన్ గడ్డను ఉపయోగించుకోరాదని గట్టిగా చెప్పారు.

# శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో మంత్రి సబితారెడ్డి



రంగారెడ్డి, ఫిబ్రవరి 15మహేశ్వరం మండల పరిధిలోని పడమటి తాండ, ఉప్ప గడ్డ తాండలలో జరిగిన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 283వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యా శాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ?శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 283వ జయంతిని బంజారా సోదర సోదరీమణులు ఘనంగా జరుపుకున్న వారు చూపిన మార్గంలో పయనించడం గొప్ప విషయమని కొనియాడారు. ఫలితం ఆశించని పనులు చేయాలని శ్రీ సేవాలాల్ మహారాజ్ గొప్పగా పిలుపునిచ్చారని గుర్తు చేశారు. బంజారా జాతికే కాదు యావత్ జాతికి ఆదర్శప్రాయులుగా నిలిచారని తెలిపారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన తాండాలు, హరిజన వాడలు బాగుపడాలని ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్ తీసుకువచ్చి, వారి నిధులు పూర్తిగా వారికే దక్కేలా, అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి అయ్యేలా కృషి చేస్తున్నారన్నారు. గిరిజనుల ఆత్మగౌరవ ప్రతీకలుగా బంజారా భవన్ ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో నిర్మిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ లో బంజారా భవన్ కు స్థలం, నిధులు కేటాయించారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి కావొస్తుందని సబితారెడ్డి పేర్కొన్నారు.

# గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ లో నటి 'లహరి'



హైదరాబాద్, ఫిబ్రవరి 15:గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొంది బిగ్ బాస్ బ్యూటీ, నటి లహరి. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ పార్క్ లో మొక్కలు నాటింది. ఈ సందర్భంగా లహరి మాట్లాడుతూ.. రాబోయే బావి తరాలకు మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు.వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలని, మంచి ఆక్సిజన్ లభించాలన్నా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. గ్రీన్‌ఇండియా చాలెంజ్ లో పాల్గొని మొక్కలు నాటినందుకు సంతోషంగా ఉందని అన్నారు.అనంతరం నటరాజ్ మాస్టర్,సరయు,ప్రియాంక సింగ్ ముగ్గురికి గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరింది లహరి.


ఆహ్వానం

తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

సౌజన్యంతో

**పరిణతవాణి**

(65 ఏళ్ళ ప్రాయం దాటిన ప్రఖ్యాత కవి పండితులు, ప్రముఖుల స్వీయసాహిత్య జీవిత విశేషాలను ఆవిష్కరింపజేసే ఉపన్యాస పరంపర)

2022 ఫిబ్రవరి 14 నుండి 24వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటలకు

వేదిక : డా॥ దేవులపల్లి రామానుజరావు కళామందిరం,

తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణం, తిలక్‌రోడ్, హైదరాబాదు.

ప్రారంభోత్సవం

2022 ఫిబ్రవరి 14, ఉదయం 11 గంటలకు

సభాధ్యక్షులు : ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

ముఖ్యఅతిథి : శ్రీ జూలూరి గౌరీశంకర్
అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి

విశిష్టఅతిథి : శ్రీ మామిడి హరికృష్ణ
సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ

| ప్రసంగ సంఖ్య | ప్రసంగకర్త | తేది |
| --- | --- | --- |
| 90వ ప్రసంగం | ఆచార్య ననుమాస స్వామి | 14-02-2022 |
| 91వ ప్రసంగం | ఆచార్య మసన చెన్నప్ప | 15-02-2022 |
| 92వ ప్రసంగం | శ్రీ శీలా వీర్రాజు | 16-02-2022 |
| 93వ ప్రసంగం | ఆచార్య ఎస్వీ సత్యనారాయణ | 17-02-2022 |
| 94వ ప్రసంగం | డా. సుద్దాల అశోక్‌తేజ | 18-02-2022 |
| 95వ ప్రసంగం | డా. నాళేశ్వరం శంకరం | 19-02-2022 |
| 96వ ప్రసంగం | డా. కూరెళ్ళ విఠలాచార్య | 20-02-2022 |
| 97వ ప్రసంగం | డా. నలిమెల భాస్కర్ | 21-02-2022 |
| 98వ ప్రసంగం | శ్రీ బి. నరసింగరావు | 22-02-2022 |
| 99వ ప్రసంగం | డా. కె.వి. రమణాచారి, ఐఏఎస్ (రి) | 23-02-2022 |
| 100వ ప్రసంగం | ఆచార్య ఎల్లూరి శివారెడ్డి | 24-02-2022 |

గమనిక: కల్చరల్ టీవీ యూట్యూబ్‌లో ప్రత్యక్షప్రసారం జరుగుతుంది.

ఈ కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి

